మూషికాలతో ముప్పు!



- పొట్ట దశలో వరి పైరును తినివేస్తున్న ఎలుకలు
- ఏటా ఖరీఫ్ సీజన్‌లో ఇదే తంతు
- ప్రభుత్వ చర్యలు శూన్యం
- నష్టాల బారినపడుతున్న రైతులు



ఎలుకల నివారణకు వరి పైరులో తాటికమ్మలు ఏర్పాటు చేసిన దృశ్యం, (ఇన్‌సెట్‌లో) ఎలుకలు వరి దుబ్బు తినివేయడంతో పాడైన పంట

రామభద్రపురం: రైతన్నను కష్టాలు వీడడం లేదు. అరుగాలం శ్రమించి పండిస్తున్న పంటను ఎంతో జాగ్రత్తగా కాపాడుకుని వస్తూ ఉంటే.. అకాల వర్షాలు, తెగుళ్లు, చీడపీడలు అని అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇవి చాలవన్నట్లుగా ప్రస్తుతం పొట్ట దశలోని వరి పంటకు మూషికాల బెడద ఎక్కువైంది. పొట్ట దశలోని పంట దుబ్బు, పిలకలు తీపిగా ఉండడంతో వాటిని తినివేసేందుకు ఎలుకలు పొలాల్లో విపరీతంగా సంచరిస్తూ పంటను నాశనం చేస్తున్నాయి.

97 వేల హెక్టార్లలో సాగు..

జిల్లాలో మొత్తం 97 వేల హెక్టార్లలో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. సకాలంలో వర్షాలు పడిన ప్రాంతాల్లో జూలైలో, వర్షాభావ పరిస్థితులున్న ప్రాంతాల్లో ఆగస్టు చివరి నాటికి ఉబాలు(వరినాట్లు) వేయడం పూర్తి చేశారు. రైతులు పంటలకు వేసిన ఎరువుల కారణంగా వరి పైరు వేగంగా పెరిగి, కొన్నిచోట్ల దుబ్బు కట్టే దశకు చేరుకుంది. మరి కొన్నిచోట్ల పొట్ట దశకు చేరుకుంది. ఈ దశలో తీపిగా ఉండే పిలకలు, పొట్ట, దుబ్బులను ఎలుకలు కొరికివేస్తున్నాయి. దీంతో పంటకు నష్టం వాటిల్లుతోంది. ఏటా ఇదే దుస్థితితో దిగుబడులు కోల్పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ చర్యలు శూన్యం..

పంటకు ఎలుకల బాధ తప్పేలా ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు శూన్యం. ఎలుకల పట్టే బుట్టలు గానీ బ్రోమోడయోలిన్ మందు గానీ వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేయాల్సి ఉన్నా ఇప్పటివరకు అటువంటి చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. నేటికీ జిల్లాలో ఎక్కడా ఎలాంటి చర్యలు ఆ దిశగా చేపట్టకపోవడం బాధాకరం. మరోవైపు మూషికాల బారి నుంచి వరి పైరును ఎలా రక్షించుకోవాలో వ్యవసాయాధికారులు పలు సూచనలు, సలహాలు ఇస్తుండడం రైతులకు ఉపశమనం కలిగించే అంశం.

నివారణ చర్యలివే..

- గ్రామంలోని రైతులంతా ఓ యూనిట్‌గా ఏర్పడి సామూహిక ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి.
- ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ 0.25 మి.లీ., ఎలుకల మందుతో విషపు ఎర తయారీకి 96 పాళ్ల నూకలు, రెండు గ్రాముల నూనె కలపాలి.
- విషపు ఎర తయారీ సమయంలో చేతులకు గ్లౌజులు లేదా పాలిథిన్ సంచి తొడుక్కోవాలి. లేకపోతే మనిషి చేతివాసనను ఎలుక పసిగట్టి ఎరను స్వీకరించదు.
- ఒక్కో ఎలుక రంధ్రంలో 10 గ్రాముల ఎరను ఓ కాగితంలో చుట్టి పెట్టాలి. పొట్లం పెట్టిన వెంటనే ఆ రంధ్రం మూసివేయకూడదు.
- ఎర మందు పెట్టేటప్పుడు భారీ, మోస్తరు వర్షం గానీ వస్తే వర్షం ఆగే వరకు చూడాలి. లేదంటే మరుసటి రోజుకు వాయిదా వేయాలి. ఎర మందు వర్షంలో తడిస్తే పనిచేయదు.
- ఒకసారి కలిపిన ఎర మందు వాసనను 12 గంటలు దాటిన తర్వాత ఎలుకలు పసిగడతాయి. కాబట్టే ఈ మిశ్రమాన్ని మధ్యాహ్నం కలిపి సాయంత్రం లోపు పెట్టేయాలి. ఎలుకలు నిశాచరులు కావున సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు ఎరమందును స్వీకరించే అవకాశం ఉంటుంది.
- మందు తిన్న నాలుగైదు రోజులకు ఎలుక చనిపోతుంది. ఈ మందు తిన్న ఎలుకల రక్తం గడ్డ కట్టదు. అవి రక్తస్రావమై రక్తహీనతతో చనిపోతాయి.
- **పొగ పెట్టాలి..**

  పొగబారించే యంత్రం(బర్రోఫ్యూమి గేటర్)తో ఎలుకల రంధ్రాలను కప్పి, రెండు నుంచి మూడు నిమిషాల పాటు పొగ పెడితే తల్లి, పిల్ల ఎలుకలన్నీ చనిపోతాయి. ఎలుకల రంధ్రాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పొగ పెట్టడం చాలా మంచిది.

ఏటా నష్టపోతున్నాం..



వ్యవసాయంలో ఏటా నష్టపోతున్నాం. పంట వేసిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు ఎంతో శ్రమ పడితే గానీ దిగుబడి రావడం లేదు. ప్రస్తుతం వరి పంటకు తెగుళ్లు, చీడపీడలు, ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. గతేడాది ఎకరాకు 30 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇప్పుడు 25 బస్తాలు వస్తాయో రావో చూడాలి.

– సీహెచ్ అప్పలనాయుడు, రైతు, రామభద్రపురం.

రైతులు దృష్టి సారించాలి..



యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ఎలుకలను నివారించుకోవాలి. మూషికాలతో పంటలకు తీవ్ర నష్టం జరుగుతోంది. రాష్ట్రంలో ఏటా లక్షల టన్నుల ఆహార ధాన్యాలను అన్నదాతలు నష్టపోతున్నారు. రైతులంతా నివారణ చర్యలపై దృష్టిసారించాలి. సామూహికంగా ఎలుకల నివారణకు ఐక్యంగా ముందడుగు వేయాలి. విషపు ఎరలు పెట్టడం దగ్గర నుంచి ట్రాప్‌లు, పొగబారించే పద్ధతులు ఎన్నో ఉన్నాయి, వాటిని అవలంబించాలి.

– వీటీ రామారావు, జిల్లా వ్యవసాయాధికారి

తోటపల్లి నీరందక రైతుల ఇబ్బందులు

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రేగిడి: తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని తునివాడ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాసేపు మాట్లాడారు. ఇరిగేషన్ అధికారుల అలసత్వం కారణంగానే ఈ సమస్య వచ్చిందని ఆరోపించారు. రాజాం బ్రాంచి కెనాల్ ద్వారా రేగిడి మండలానికి 14ఎల్, 16ఎల్, 17ఎల్ కాలువల ద్వారా సాగునీరు పంట పొలాలకు అందాల్సి ఉందన్నారు. పంట చేతికి వచ్చే సమయానికి తగినంత నీరు లేకపోవడంతో పంట పాడయ్యే ప్రమాదం ఉందన్నారు. బూరాడ, చిన్నశిర్లాం, తాటిపాడు, లక్ష్మణవలస, వావిలవలస, సోమరాజుపేట, లింగాలవలస, తోకలవలస, పెద్దశిర్లాం, కాగితాపల్లి, పోరాం, ఉనుకూరు తదితర గ్రామాల పరిధిలో 3,750 ఎకరాల ఆయకట్టు ఉందని, ఆయా ప్రాంతాల రైతులంతా సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సాగునీరందించాలని, లేకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, చుక్కా వెంకటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

బాడంగి: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గజరాయునివలస గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బేబీనాయన బుధవారం భూమిపూజ చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి మంజూరైన రూ.6.61 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, సీసీ కాలువలు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం రూ.19.85 లక్షల వ్యయంతో రాజాం–రామభద్రపురం రోడ్డు నుంచి గ్రామంలోకి.. గ్రామంలో మరికొన్ని బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ మూడడ్ల సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని, పెద్దగెడ్డ లేదా ఏడొంపులగెడ్డ ద్వారా గ్రామానికి సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బొబ్బిలి, బాడంగి మండలాలను అనుసంధానిస్తూ వేగావతి నదిపై గొల్లాది వద్ద వంతెన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి, ఎంపీటీసీ పాలవలస గౌరు, పీఆర్ డీఈఈ అప్పారావు, ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

తెర్లాం: మండలంలోని మోదుగువలస గ్రామంలో పల్లె పండగ కార్యక్రమం బుధవారం నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ చీకటి పార్వతి భూమిపూజ చేశారు. ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు పెట్టాలి



పుస్తకాలు అందజేస్తున్న డిప్యూటీ ఈవో మోహనరావు



రేగిడి: విద్యార్థుల మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో ప్రసాదరావు

బొబ్బిలి: మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు పెట్టాలని డిప్యూటీ ఈవో మోహనరావు సూచించారు. మండల కేంద్రంలోని గొల్లపల్లి ఎస్‌వీజీ మున్సిపల్ పాఠశాలను బుధవారం సందర్శించిన ఆయన.. తరగతుల నిర్వహణ, పాఠశాల పరిసరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందివ్వాలని తెలిపారు. అనంతరం లెర్న్ అండ్ హెల్ప్ సంస్థ అధిపతి శివరామకృష్ణ రూ.50 వేలతో గ్రంథాలయానికి వితరణ చేసిన పుస్తకాలను ఆయన ప్రారంభించి, సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 వాసు, ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని గుళ్లపాడు గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఎంవీ ప్రసాదరావు బుధవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాలు తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందివ్వాలని సిబ్బందిని ఆయన సూచించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే పాఠ్యాంశాల బోధన చేయాలన్నారు.

పరామర్శ



ఆనందరావు భార్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండలంలోని రావివలసకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పూడి ఆనందరావు, ఆయన భార్యను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బుధవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆనందరావు, ఆయన భార్య గాయపడగా, ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వారి దగ్గరకు వెళ్లి, ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. అనంతరం ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడి విధానం అవలంబించాలి

రాజాం: రైతులంతా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని ఏవో ఎ.రేణుకాసాయి సూచించారు. మండలంలోని రాజయ్యపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె తొలుత పంట పొలాలు పరిశీలించి, రబీ సీజనల్‌లో పండించాల్సిన పంటలపై పలు సూచనలు చేశారు. ఎప్పుడూ ఒకే పంట సాగును చేయకుండా ఏడాదికో పంటను సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయని, నేల సారం కూడా బాగుంటుందన్నారు. అక్కడి నుంచి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి, రైతులకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు.

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించగా, వరి పంటలో వచ్చే తెగుళ్ల నివారణకు రైతులకు ఏవో పైల నవీన్ పలు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయపై దృష్టి సారించాలని రైతులను కోరారు.

వంగర: మండలంలోని జగన్నాథవలస గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించగా, ఏవో తట్టికోట కన్నబాబు ఈ కార్యక్రమానికి హాజరై, పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

రేగిడి: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని దేవుదళ గ్రామంలో రైతులతో ఏవో జి.మురళీకృష్ణ బుధవారం సమావేశమై, సాగు విధానాలు, అధిక దిగుబడులకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

సన్మానం



పోలీసులను సత్కరిస్తున్న రాజాం గ్రామదేవత పండగ కమిటీ సభ్యులు

రాజాం సిటీ: సారధి, రాజాం గ్రామదేవతల పండగలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సక్రమంగా విధులు నిర్వర్తించిన పోలీస్ సిబ్బందిని అభినందిస్తూ స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో వారిని బుధవారం సన్మానించారు. గత నెల రోజులుగా జరిగిన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగాయంటే దానికి ముఖ్య కారణంగా పోలీస్ సిబ్బంది సేవలేనని గ్రామదేవత పండగ కమిటీ సభ్యులు ప్రశంసించారు.

సర్పంచ్‌లకు ఆహ్వానం కరువు





కాశిందొరవలసలో సర్పంచ్ లేకుండా పల్లె పండగ కార్యక్రమంలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్లో) ఆహ్వానం అందలేదని చెబుతున్న సర్పంచ్ దాలమ్మ

బొబ్బిలిరూరల్: మండల వ్యాప్తంగా జరుగుతున్న పలు ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచ్‌లను ఆహ్వానించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచ్‌లనే భావనతోనే అధికార పార్టీ నేతలు వారిని దూరం పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని కాశిందొరవలస గ్రామంలో బుధవారం జరిగిన పల్లె పండగ కార్యక్రమానికి తనను ఆహ్వానించలేదని సర్పంచ్ కె.దాలమ్మ వాపోయారు. అధికార పార్టీల నేతలనే పిలిచి, కార్యక్రమాలు జరుపుకుంటున్నారన్నారు. గ్రామ ప్రథమ పౌరురాలు అయిన తనకే ఇలా చేస్తే ఇక సామాన్య పౌరుడి పరిస్థితి ఏంటని నిలదీశారు. ప్రస్తుతం చేపట్టే అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగితే ఎవరు బాధ్యులవుతారని ప్రశ్నించారు. అధికారులు కూడా అధికార పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వేరే పార్టీకి చెందిన వారమనే చిన్న చూపు తగదన్నారు. ఇదే విషయంపై ఎంపీడీవో రవికుమార్ స్పందిస్తూ కాశిందొరవలసలో జరిగే కార్యక్రమానికి సర్పంచ్‌కు ఆహ్వానం లేకపోవడమనే అంశం తన దృష్టికి వచ్చిందని, విచారణ జరుపుతున్నామన్నారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి బోర్ల మరమ్మతులు




బోరు బాగు చేస్తున్న మెకానిక్ కృష్ణ

తెర్లాం: మండలంలోని రంగప్పవలస గ్రామంలో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులు బుధవారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. సర్పంచ్ శసపతి రాంబాబు సమక్షంలో మెకానిక్ బోడెల కృష్ణ బోర్లు బాగు చేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. గ్రామంలో తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు.

రేగిడి: మండలంలోని ఆమదాలవలస కాలనీ వద్ద రాజాం ప్రాంతానికి తాగునీటిని అందిస్తున్న పైప్‌లైన్ మరమ్మతులు బుధవారం చేపట్టారు. లీకేజీకి కారణమైన పాత ఎయిర్‌వాల్స్‌ను తొలగించి, వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చారు.

బురదలపోలమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న డాక్టర్ తలే రాజేష్ దంపతులు

రాజాం: గ్రామదేవత బురదలపోలమ్మ ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సతీసమేతంగా బుధవారం పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుమ్మరి వీధిలోని ఆలయం వద్దకు వెళ్లి, అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవీలత, వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతపై దాడి



అంబులెన్స్‌లో పెంటన్నాయుడును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని కోడిశ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ నెల్లి పెంటన్నాయుడుపై గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. పొలంపనులు ముగించుకుని, గ్రామ ప్రధాన వీధి రోడ్డు మీదుగా ఇంటికి వెళ్తుండగా, చీకటి ప్రాంతం నుంచి రాళ్లు విసిరి దాడి చేశారు. దీంతో పెంటన్నాయుడు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అప్రమత్తమై 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, వైద్యసేవల నిమిత్తం రాజాం ఏరియా ఆస్పత్రికి అతడిని తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నీలావతి గ్రామానికి చేరుకుని, పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులే దాడి చేసి ఉంటారని బాధిత కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపి, నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

సకాలంలో సేవలందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: సచివాలయాలకు వస్తున్న ప్రజలకు సకాలంలో సేవలందించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అంతకాపల్లి గ్రామ సచివాలయాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత మూడు నెలల్లో సచివాలయానికి వచ్చిన దరఖాస్తులు, వాటి మంజూరు, పలు సమస్యలపై వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారం వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై, పలు సూచనలు చేశారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, సమస్యలను పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. సమయపాలన పాటించాలని, పనివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

మూతపడిన పరిశ్రమలు తెరిపించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి:

మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని సీపీఐ నాయకులు కోట అప్పన్న డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. మండల కేంద్రం సహా పరిసర ప్రాంతాల్లో జ్యూట్‌మిల్లు, సుగర్ ఫ్యాక్టరీ మూతపడ్డాయని, దీంతో ఎంతోమంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డునపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్లీ ఆ పరిశ్రమలను తెరిపిస్తే చాలామందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆ పరిశ్రమలు ఉన్నాయనే ఇక్కడి రైతులు చాలామంది గోగు, చెరకు పంటలను పండిస్తున్నారన్నారు. ఇక్కడ ఆ పరిశ్రమలు లేకపోవడంతో రైతులకు తమ పంటలను ఇతర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీలకు తరలించడం కష్టమవుతోందన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి, పరిశ్రమల పునఃప్రారంభానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో మునకాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశమైన ఆయన.. ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద తయారీ కేంద్రాలు) షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 19వ తేదీ వరకు పల్లె పండగ కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ



విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: పట్టణంలోని పలు వసతిగృహాలను రాజాం సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, భోజన సదుపాయాలపై సిబ్బందిని ఆరాతీశారు. విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదులు, పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచాలని హాస్టల్ వార్డెన్లకు సూచించారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ప్రభుత్వ న్యాయవాది శెట్టి పోలారావు, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ఈసీహెచ్ జయదేవ్ తదితరులు ఉన్నారు.

డ్వాక్రా బజారులో కొప్పెర ఉత్పత్తులు



స్టాల్ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న ఏసీ చిరంజీవి

వంగర: విజయనగరంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజారులో మండలంలోని కొప్పర గ్రామ ఉత్పత్తులు ప్రదర్శించారు. శ్రీరాజులమ్మ స్వయం సహాయక సంఘ నిర్వాహకురాలు లగ్గు మౌనిక మాప్ స్టిక్ స్టాల్ ఏర్పాటు చేసి, స్టిక్‌లు విక్రయిస్తున్నారు. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఆ స్టాల్‌ను రాజాం ఏరియా కో–ఆర్డినేటర్ ఎ.చిరంజీవి బుధవారం సందర్శించి, సేల్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

శునకాలకు ఏబీసీ ఆపరేషన్లు



రాజాం పట్టణంలో శునకాలు పడుతున్న సిబ్బంది

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని డోలపేట, మారుతీనగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లోని శునకాలకు ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్) ఆపరేషన్లు బుధవారం చేశారు. ఆయా ప్రాంతాల్లో కుక్కల స్వైరవిహారంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని అక్కడి వారి నుంచి వస్తున్న ఫిర్యాదులకు స్పందించిన మున్సిపల్ అధికారులు శ్రీకాకుళం ఏజెన్సీ వారితో కుక్కలను పట్టించి, ఆపరేషన్లు చేయించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు పలువురి ఎంపిక

బొబ్బిలిరూరల్: స్థానిక రెసిడెన్షియల్ స్కూల్‌లో బుధవారం జరిగిన నియోజకవర్గ స్థాయి వాలీబాల్ క్రీడాపోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ(ఫిజికల్ డైరెక్టర్)లు కృష్ణమూర్తినాయుడు, అప్పలనాయుడు తెలిపారు. ఎంపికైన వారిలో బాడంగి, రామభద్రపురం, తెర్లాం, బొబ్బిలి మండలాలకు చెందిన మొత్తం 80 మంది ఉన్నారన్నారు. వీరంతా గురువారం జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.